

సంస్కృతం పరీక్షకు 3948 మంది హాజరు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్
పదో తరగతి పరీక్షల్లో మిగిలిన చివరి పరీక్ష కాంపౌండ్ సైట్ సంస్కృతం అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. గురువారం సంస్కృతం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ విద్యార్థులు 4102 మందికి 3948 మంది హాజరయ్యారని, 1504 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వీరి హాజరు శాతం 96.25గా నమోదైందని చెప్పారు. సింగిల్ సెట్టింగ్ విద్యార్థులు 39 మంది ప్రయివేట్ విద్యార్థులకు 13 మంది హాజరయ్యారని, 26 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. సంస్కృతం పరీక్ష ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, మాల్ ప్రాక్టీసులు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు.

గెలుపుపై ఓట్ల లెక్కలు..!

- రెండు జిల్లాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపిక పూర్తి
- 2019 ఎన్నికల్లో పోలైన ఓట్ల ఆధారంగా గెలుపుపై అంచనాలు
- వైసిపికొచ్చిన ఓట్లు, టిడిపి, జనసేన ఓట్లతో పోలికలు
- 14 అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటములపై ఎవరి లెక్క వారిదే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
జిల్లాలో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. ప్రధాన పార్టీలైన వైసిపి, పొత్తుతో ఎన్నికల బరిలోకి దిగిన టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థుల ఎంపిక పూర్తయ్యింది. ముఖ్యంగా అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటములపై ఇరుపక్షాలు ఓట్ల లెక్కలతో ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాయి. 2019 ఎన్నికల్లో పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో 14 స్థానాలు ఉండగా 12 చోట్ల వైసిపి, రెండు చోట్ల టిడిపి ఎంఎల్ఎలు గెలుపొందారు. గత ఎన్నికల్లో వైసిపి, టిడిపి సింగిల్‌గా పోటీ చేయగా జనసేన సిపిఎం, సిపిఐతో పొత్తు పెట్టుకుని పోటీకి దిగింది. ఈసారి ఎన్నికల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అధికార వైసిపి ఒంటరిగా బరిలోకి దిగగా, టిడిపి, జనసేన, బిజెపి పొత్తుతో రంగంలోకి దిగాయి. 2019 ఎన్నికల్లో వైసిపికి పోలైన ఓట్లు, టిడిపి, జనసేన మిత్రపక్షాలకు వచ్చిన ఓట్లను కలిపి లెక్కలు కడుతున్నారు. ఆ ప్రకారం అత్యధిక సీట్లు ఏ పార్టీ గెలిచే అవకాశం ఉందని అంచనాలు వేస్తూ బెట్టింగులు సైతం వేస్తున్నారు. గత ఎన్నికల ఓట్ల లెక్కల ఆధారంగా ఇప్పుడు ప్రధాన పార్టీలు తమ ఎన్నికల వ్యూహాలు రచిస్తున్నాయి. గత ఎన్నికల్లో 14 సీట్లకుగాను 12 చోట్ల వైసిపి గెలిచింది. ఈసారి టిడిపి, జనసేన, బిజెపి పొత్తుతో ముందుకు రావడంతో నియోజకవర్గాలవారీగా ఆయా పార్టీలకు వచ్చిన ఓట్ల ప్రకారం లెక్కలు కడితే టిడిపి, జనసేన, బిజెపి ఎక్కువ స్థానాలు రావొచ్చు అంటూ గెలుపోటములపై లెక్కలు కడుతున్న పరిస్థితి ఉంది. అదే సమయంలో తాము చేపట్టిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ఓటర్లు తమవైపు ఉన్నారని, గత ఎన్నికల్లో పోలైన ఓట్లు లెక్కలన్నీ తారుమారు కావడం ఖాయమని, గతంలో మాదిరిగానే అత్యధిక స్థానాలు సొంతం చేసుకుంటామని వైసిపి ధీమాగా ఉంది. గత ఎన్నికల సరళిని పరిశీలిస్తే ఉంగుటూరు నియోజకవర్గంలో వైసిపికి 94,012 ఓట్లు రావడంతో అక్కడ వైసిపి అభ్యర్థి గెలిచారు. అప్పుడు టిడిపి, జనసేనకు వచ్చిన మొత్తం ఓట్లు 71,954 మాత్రమే. గత ఎన్నికల సరళిని బట్టి చూస్తే ఈ నియోజకవర్గంలో వైసిపికి అనుకూలంగా ఉంటుందని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో 2019లో వైసిపికి వచ్చిన ఓట్లు 95,788 రాగా, టిడిపి, జనసేన అభ్యర్థులు ఇద్దరికీ వచ్చిన ఓట్లు 84,503. దీంతో ఇక్కడ వైసిపినే మరోసారి గెలుస్తుందని ఆ పార్టీ నేతలు లెక్కలు వేస్తున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపికి 1,14,515 ఓట్లు రాగా, టిడిపి, జనసేన అభ్యర్థులిద్దరికీ కలిపి 90,929 ఓట్లు వచ్చాయి. ఇక్కడే తామే గెలుస్తామని వైసిపి చెబుతోంది. పోలవరం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపికి 1,09,522 ఓట్లురాగా టిడిపి, జనసేనకు కలిపి 81,439 ఓట్లు వచ్చాయి. రెండు పార్టీల ఓట్లు కలిపినా వైసిపికే ఆధిక్యత ఉంది. ఏలూరు నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపికి 71,404 ఓట్లు రాగా, టిడిపి, జనసేన అభ్యర్థులకు 84,450 ఓట్లు వచ్చాయి. ఇక్కడ పొత్తులో భాగంగా టిడిపి అభ్యర్థి గెలుస్తారని ఆ పార్టీ నేతలు లెక్కలు కడుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపికి 81,578 ఓట్లురాగా, టిడిపి, జనసేనకు కలిపి 83,283 ఓట్లు వచ్చాయి. దీంతో ఇక్కడ పొత్తులో భాగంగా బిజెపి అభ్యర్థి గెలుస్తారా లేదా అనేది వేచిచూడాలి. నూజివీడు నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపికి 1,01,705 ఓట్లు రాగా, టిడిపి, జనసేన అభ్యర్థులకు 91,088 ఓట్లు వచ్చాయి. దీంతో అదే సరళి కొనసాగితే ఈ ఎన్నికల్లో వైసిపినే గెలిచే అవకాశం ఉందని లెక్కలు కడుతున్నారు. ఏలూరు జిల్లాలో ఏడు స్థానాల్లో గత ఎన్నికల సరళిని బట్టి పరిశీలిస్తే టిడిపి, జనసేన, బిజెపి కలిసినప్పటికీ వైసిపి ఐదు స్థానాలు, టిడిపి కూటమికి రెండు స్థానాలు దక్కే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఏలూరు ఎంపీ స్థానంలో గత ఎన్నికల్లో వైసిపికి 6,76,809 ఓట్లురాగా, టిడిపి, జనసేన అభ్యర్థులకు కలిపి 5,87,711 ఓట్లు వచ్చాయి. ఇక్కడా వైసిపిదే ఆధిక్యంగా కన్పిస్తోంది.

పశ్చిమలో ఏడు స్థానాల్లో టిడిపి కూటమికే ఆధిక్యం!

పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు అసెంబ్లీస్థానాలు ఉండగా గత ఎన్నికల్లో వైసిపి ఐదుచోట్ల, టిడిపి, రెండుచోట్ల గెలిచింది. గత ఎన్నికల సరళిని బట్టి ఏడుస్థానాల్లో వైసిపి కంటే, టిడిపి, జనసేన ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. ఆచంటలో గత ఎన్నికల్లో వైసిపికి 66,494 ఓట్లురాగా, టిడిపి, జనసేనకు కలిపి 67,601 ఓట్లు వచ్చాయి. ఉండిలో వైసిపికి 71,781 ఓట్లురాగా, టిడిపికి, జనసేన పొత్తుతో పోటీ చేసిన సిపిఎంకు కలిపి 1,07,467 ఓట్లు వచ్చాయి. పాలకొల్లులో వైసిపికి 49,740 ఓట్లురాగా టిడిపి, జనసేనకు 1,00,533 ఓట్లు వచ్చాయి. తణుకు నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపికి 75,975 ఓట్లురాగా టిడిపి, జనసేనకు 1,05,741 ఓట్లు పోలయ్యాయి. తాడేపల్లిగూడెంలో గత ఎన్నికల్లో వైసిపికి 70,741 ఓట్లురాగా, టిడిపి, జనసేనకు కలిపి 90,472 ఓట్లు వచ్చాయి. నరసాపురంలో వైసిపికి 55,556 ఓట్లు రాగా, టిడిపి, జనసేనకు కలిపి వచ్చిన ఓట్లు 76,179. భీమవరంలో గత ఎన్నికల్లో వైసిపికి 70,642 ఓట్లురాగా, టిడిపి, జనసేనకు కలిపి 1,16,321 ఓట్లు వచ్చాయి. దీంతో ఏడు స్థానాల్లో పొత్తులో భాగంగా టిడిపి, జనసేన అభ్యర్థులు గెలిచే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నరసాపురం ఎంపీ స్థానానికి గత ఎన్నికల్లో వైసిపికి 4,47,594 ఓట్లురాగా, టిడిపి, జనసేన అభ్యర్థులకు 6,65,974 ఓట్లు వచ్చాయి. ఇక్కడా టిడిపి, జనసేన ఓట్లు వైసిపి కంటే ఎక్కువగా ఉన్నాయి.

ఓట్లు బదిలీ అయ్యేనా?

గత ఎన్నికల ప్రకారం అభ్యర్థులు వేస్తున్న అంచనాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ఎన్నికలకు ఇప్పటికీ సంబంధం లేదని, వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో పార్టీ బలం పెరిగిందని, అత్యధిక స్థానాలు తాము గెలుచుకుంటామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. పొత్తులో భాగంగా జనసేన ఐదు స్థానాల్లో, బిజెపి ఒక స్థానం, టిడిపి ఎనిమిది స్థానాల్లో పోటీ చేస్తోంది. నరసాపురం, భీమవరం నియోజకవర్గాల్లో మాత్రమే గత ఎన్నికల్లో జనసేనకు అత్యధిక ఓట్లు వచ్చాయి. మిగిలిన 12 నియోజకవర్గాల్లో పదింటిలో వైసిపి తర్వాత స్థానంలో టిడిపి ఉండగా, రెండు చోట్ల టిడిపి మొదటి స్థానంలో ఉంది. 12 చోట్ల టిడిపి ఓట్లు జనసేనకు, జనసేన ఓట్లు టిడిపికి బదిలీ కావాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో పోలైన ఓట్ల ఆధారంగా ఆయా పార్టీల ఓట్లు బదిలీ అవుతాయా అనే అనుమానాలు ఉన్నాయి. టిక్కెట్ రాక అలకబూనిన నాయకులతో ఇబ్బందులు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో గత ఎన్నికల ఓట్ల లెక్కలతోపాటు, సరికొత్త ప్రణాళికలతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు.

ఉల్లంఘనల నివారణకే సి-విజిల్ యాప్

ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ తనిఖీలు పెంచాలి - కలెక్టర్ ప్రసన్న వెంకటేష్




ప్రజాశక్తి - ఏలూరు
ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన సి-విజిల్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. గురువారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, సి-విజిల్ యాప్, ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సి-విజిల్ యాప్‌పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన, అక్రమ మద్యం, నగదు పంపిణీ తదితర ఘటనలకు సంబంధించి సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదులను వంద నిమిషాల్లో చర్యలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సి-విజిల్‌కు సంబంధించి రాజకీయ పక్షాల ప్రతినిధులు కూడా సంబంధిత వివరాలను అందజేసి అవగాహన పర్చాలన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా తీసిన సమాచారాన్ని ఐదు నిమిషాల్లో సంబంధిత అధికారులకు పంపాలన్నారు. ఆ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడంపై దృష్టి పెట్టాలన్నారు. సి-విజిల్ ఫిర్యాదుల పరిష్కారం, ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్‌లో ఉంగుటూరు నియోజకవర్గంలో మంచి చొరవ చూపడంపై ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె.ఖాజావలీని కలెక్టర్ అభినందించారు. నిఘా, తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. సువిధ, ఎన్ కోర్ పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులను మంజూరు చేయాలన్నారు. దీనికి సంబంధించి నియోజకవర్గాలవారీగా పురోగతిని ఆయన సమీక్షించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్ఒ డి.పుష్పమణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రాజధానిగా వైజాగ్.. వైసిపి ఘనత

నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి, నూజివీడు రూరల్
గంజాయి వ్యాపారానికి రాజధానిగా వైజాగ్‌ను తీర్చిదిద్దుతున్న ఘనత వైసిపి నేతలకు దక్కుతుందని టిడిపి అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆరోపించారు. చంద్రబాబు అరెస్టు సందర్భంగా మృతి చెందిన టిడిపి కార్యకర్తల కుటుంబాల పరామర్శకు ఉద్దేశించిన 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా ఆమె గురువారం ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లో పర్యటించారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో బెజవాడ రామారావు, ఆగిరిపల్లిలో పల్లగాని చంద్రయ్య, కలవకొల్లు శ్రీరాములమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నూజివీడు మండలం గొల్లపల్లిలో వెనిగళ్ల పూర్ణచంద్రరావు కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో 30 వేల మందికి పైగా మహిళలు అదృశ్యమైనా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి కొలుసు పార్థసారథి, బిసి సెల్ అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, నేతలు ఎం.కోటేశ్వరరావు, పి.నరసింహారావు, సిహెచ్.శివరామకృష్ణ, ఎం.గోపాల్, జి.రాజు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' బకాయిలు చెల్లించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
ఉపాధి హామీ బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం కోరింది. ఈ మేరకు ఆ సంఘం నేతలు ఎంపిడిఒ ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కూలీలకు పే స్లిప్‌లు ఇవ్వాలని, 200 రోజులు పనులు చూపి రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు తాగునీరు, మజ్జిగ, పనిముట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. నాలుగు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో కూలీలు అప్పులు చేసి కడుపు నింపుకోవాల్సి వస్తుందని తెలిపారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దునిద్ర వీడి ఉపాధి నిధులు విడుదల చేసి కూలీలకు అందించాలని డిమాండ్ చేశారు. తక్షణమే అధికారులు స్పందించి కూలీలకు పనులు పెంచి వేతనాలు పెంచి అమలు చేయాలని, పంగిడిగూడెం, దేవులపల్లి, పేరంపేట, నాగులగూడెం గ్రామాలలో తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు మాట్లాడగా నేతలు యాగంటి సీత, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు చేపట్టండి

గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టం పటిష్టంగా అమలు చేయాలి: కలెక్టర్




అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, హాజరైన అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు
జిల్లాలో గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు మందిరంలో గురువారం గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టం అమలు జిల్లా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టంను అమలు చేయని స్కానింగ్ సెంటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. స్కానింగ్‌లో మగ బిడ్డా, ఆడ బిడ్డా అని తెలుసుకుని, ఆడ బిడ్డ అయితే అబార్షన్లు చేయించుకుంటున్నారన్నారు. దీని కారణంగా సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుందన్నారు. ఇది చాలా ఆందోళన కలిగించే అంశమన్నారు. గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టాన్ని మరింత పటిష్టవంతంగా అమలు చేసేందుకు ప్రతి స్కానింగ్ సెంటర్‌పై నిఘాతోపాటు 'డెకాయ్ ఆపరేషన్'లు నిర్వహించాలని, నిబంధనలు పాటించకుండా చట్టాన్ని అతిక్రమించిన స్కానింగ్ కేంద్రాలను సీజ్ చేసి, ఆయా కేంద్రాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో గత మూడు నెలల్లో వివిధ ఆసుపత్రుల్లో 136 అబార్షన్లు జరిగాయని, ప్రతి కేసుపై సవివరమైన ఆడిటింగ్ చేయాలన్నారు. వీటిలో సహేతుకమైన కారణాలు లేకుండా జరిగిన అబార్షన్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, ఆయా ఆసుపత్రులపై కేసులు నమోదు చేయాలన్నారు. గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని, పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఎఎస్‌పి స్వరూపరాణి, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, జిల్లా బాలల సంరక్షణాధికారి సూర్యచక్రవేణి, కమిటీ సభ్యులు కెబి.సీతారాం పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు భద్రతా ఏర్పాట్లు

ఎస్‌పి మేరీ ప్రశాంతి


మానిటరింగ్ చేస్తున్న ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్
ఎన్నికలు సజావుగా సాగేందుకు పూర్తిస్థాయి భద్రత ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామని ఎస్‌పి మేరీప్రశాంతి తెలిపారు. ఓట్ల లెక్కింపునకు సిద్ధపరచిన సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల భద్రత వాటి మౌలిక సదుపాయాలపై ఎస్‌పి ప్రత్యేకంగా గురువారం మానిటరింగ్ చేశారు. ఏలూరులో ఎన్నికలు నిర్వహించిన అనంతరం ఇవిఎంలను భద్రపరిచేందుకు నగరంలోని వట్లూరు ప్రాంతంలో ఉన్న సర్ సిఆర్.రెడ్డి కళాశాలను ఎంపిక చేశారు. అయితే సిఆర్.రెడ్డి కళాశాల భద్రత వాటి మౌలిక సదుపాయాలపై మానిటరింగ్ చేసేందుకు ఎస్‌పి మేరీప్రశాంతి గురువారం కళాశాలకు చేరుకుని పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సిఆర్.రెడ్డి కళాశాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని మూడో పట్టణ పోలీసులకు సూచించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ మల్లేశ్వరరావు, త్రీ టౌన్ సిఐ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ సిఐ శ్రీనివాసరావు, వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు.

పలువురు ప్రముఖుల వాహనాలు తనిఖీ


కామవరపుకోట : వాహనాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - కామవరపుకోట
రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కామవరపుకోటలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద గురువారం పలువురు ప్రముఖుల వాహనాలను తనిఖీలు చేసినట్లు ఎన్నికల అధికారి ఎండి.మొహిద్దీన్ తెలిపారు. చెక్ పోస్ట్ మీదుగా వెళ్తున్న తెనాలి, ఉంగుటూరు ఎంఎల్ఎలు కన్నావత్తుల శివకుమార్, పుప్పాల వాసుబాబు, వైసిపి ఏలూరు పార్లమెంటు అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్, చింతలపూడి ఎంఎల్ఎ కంభం విజయరాజు, కామవరపుకోట మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ఘంటా సుధీర్ బాబు వాహనాల్లో తనిఖీలు నిర్వహించారు. ఉంగుటూరు ఎంఎల్ఎ వాహనానికి, వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి వాహనానికి జెండాలు ఉండటంతో అనుమతి ధ్రువ పత్రాలను పోలీస్ కానిస్టేబుల్స్ రామకృష్ణ, అశోక్, సిఐఎస్ఎఫ్ జవాన్లతో కలిసి పరిశీలించి వారిని పంపించారు. ఎన్నికల నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని చెప్పారు.

సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలి
ఎస్ఇబి ఎఎస్‌పి సూర్యచంద్రరావు


జీలుగుమిల్లి : సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఇబి ఎఎస్‌పి

జీలుగుమిల్లి : అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని ఎస్ఇబి అడిషనల్ ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తాటియాకులగూడెంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పని తీరు గురించి ఆరా తీశారు. అనంతరం ఇటీవల నమోదైన కేసుల వివరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల గుండా మద్యం, నాటుసారా, గంజాయి వంటివి అక్రమంగా తరలిపోకుండా ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు వీలుగా చీరలు, బహుమతులు వంటివి వాహనాల్లో తరలిపోకుండా చూడాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సిబ్బంది 24 గంటల పాటు తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఎస్ఇబి సిఐ పట్టాభిచౌదరి, ఎస్ఇబి ఎస్ఐ శేఖర్‌బాబు, ఎలైజర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు సడలించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీల కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బంది కలిగించే ఎన్నికల నిబంధనలను పున:పరిశీలించాలని ఎన్నికల కమిషన్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో కరపత్రాల పంపిణీకి అనుమతి తీసుకోవాలన్న నిబంధనలను, ఇంటింటి క్యాంపెయిన్ కోసం 48 గంటల ముందు రిటర్నింగ్ అధికారుల అనుమతి తీసుకోవాలనే అంశంపై ఎలక్షన్ కమిషన్ పున:పరిశీలించాలని కోరారు. రాష్ట్ర, కొన్ని జిల్లా పార్టీ కార్యాలయాల దగ్గర ఏర్పాటు చేసిన జెండా స్తంభాలు, బ్యానర్లు తొలగిస్తున్నారని, ఇది సరికాదని చెప్పారు. మేడేకు ఎటువంటి ఆంక్షలు లేకుండా కార్య క్రమం నిర్వహణకు అనుమతించాలని కోరారు. ఎలక్షన్ నిబంధనను అన్ని పార్టీలు తూచా తప్పకుండ పాటించాలని, కాకపోతే పార్టీ కార్యక్రమాల నిర్వహణకు ఎలక్షన్ నిబంధనలు ఆటంకం కాకుండా ఉండాలనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎలక్షన్ కమిషన్ ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు

సమస్యాత్మక కేంద్రాలను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి ఖజావలీ


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి

ప్రజాశక్తి - భీమడోలు
భీమడోలు మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించిన గ్రామాల్లో ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి గురువారం పర్యటించారు. దీనిలో భాగంగా చెట్టున్నపాడు, ఆగడాలలంక, అంబరుపేట, లింగం పాడు గ్రామాల్లో ఎనిమిది సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను సందర్శించారు. అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలు, ఇతర వసతులను పరిశీలించారు. చెట్టున్నపాడు గ్రామంలోని పోలింగ్ బూత్‌లోని ఒక గదిలో నిరుపయోగంగా ఉన్న సామగ్రి ఉండటం గమనించి వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఇబ్బందులు లేకుండా చూసేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఉంగుటూరు నియోజకవర్గం పరిధిలోని 3204 మంది వికలాంగులు, 85 ఏళ్లు పూర్తి చేసుకున్న 982 మంది వయోవృద్ధ ఓటర్లు ఓటు హక్కును ప్రత్యేక పరిస్థితుల్లో వినియోగిం చుకునే విషయమై పరిశీలిస్తున్నామన్నారు. ఇదే విషయమై భీమడోలు మండలంలో 300కు పైబడి వికలాంగులు, 200కు పైగా వయోవృద్ధులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. ఆయన చెట్టున్నపాడు గ్రామ పర్యటనలో ఉండగా గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్రావు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆర్‌డిఒ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహశీల్దార్ వరాహలయ్య, ఎంపిడిఒ స్వర్ణలత పాల్గొన్నారు.

చింతలపూడి టిక్కెట్ నాకే

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సుందరరావు

చింతలపూడి : కాంగ్రెస్ పార్టీ చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సీటు తనకే వస్తుందని ఆ నియోజకవర్గ సమన్వయకర్త విస్సాంపల్లి సుందరరావు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీటు తనకే వస్తుందని, తమ కుటుంబం మొత్తం కాంగ్రెస్ పార్టీకి సేవ చేశామని చెప్పారు. తాను స్థానికుడినని, ఇక్కడే శాశ్వతంగా ఉంటానని చెప్పారు. ఎంఎల్ఎ సీటు తనకే వస్తుందని వైఎస్.షర్మిల, రాహుల్‌గాంధీ తనకు హామీ ఇచ్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో తాను ఉంటానని తెలిపారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాల ఆవరణలో జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు గురువారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. మొత్తం ఆరు టీములు మూడు రోజులు పాటు తలపడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు భారీ స్థాయి బహుమతులను అందించనున్నట్లు చెప్పారు. జాతీయస్థాయిలో మొట్టమొదటిసారి పోటీలు నిర్వహించడంతో ఔత్సాహిక క్రీడాకారులు తరలి వచ్చారు. క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లను చేశారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలని తహశీల్దార్ జోజి, ఎంపిడిఒ విజయప్రసాద్ సూచించారు. స్థానిక మండల కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎవరైనా మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ (ఎంసిసి) ఉల్లంఘనకు పాల్పడితే సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఈ యాప్‌ను గూగుల్ పే నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఫిర్యాదులను పరిష్కరిస్తారన్నారు. మండల ప్రజా పరిషత్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాగులగూడెం, పంగిడిగూడెం, శ్రీనివాసపురం, ఎ.పోలవరం సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని చెప్పారు. ఆయా గ్రామాల్లో మైక్రో అబ్జర్వేషన్స్ చేస్తామన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎన్నికలు జరుగుతున్నాయని, ఎనిమిది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వికలాంగుల కోసం ర్యాంపు ఏర్పాటు చేశామని తెలిపారు.

ముందే వచ్చిన మామిడికి గిరాకీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలో ముందే వచ్చిన మామిడి రసాల పండ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. పట్టణంలోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ రోడ్డులో నూజివీడు రసం మామిడి పండ్లు గురువారం అమ్మకాలు కొనసాగించారు. ఈ సందర్భంగా మామిడి రైతు రావూరి రంగా మాట్లాడుతూ సిద్ధార్థ నగర్ తండాలో 2.50 ఎకరాల మామిడి తోటలో ముదురు మామిడికాయలు కాశాయని, సహజ సిద్ధంగా పండించి డజను రూ.600 నుంచి రూ.700 వరకు విక్రయిస్తున్నామని తెలిపారు.

కృష్ణబాబు, కనకరావులకు అభినందన

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రజానాట్యమండలి జానపద కళాకారుడు ఎల్ఆర్.కృష్ణబాబు, బుర్రకథ కళాకారుడు కనకరావులకు ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు కళాభినందనలు తెలిపారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి రచించిన పాటను పాడిన కృష్ణబాబును జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయం వద్ద జరిగిన సంబరాల్లో ఘనంగా సన్మానించి కళాభివందనం తెలిపారు. కృష్ణబాబును సీనియర్ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ, ప్రముఖ రంగస్థలం కళాకారులు తోట సత్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ, చిలుకూరి సుబ్బయ్య చారి, ప్రముఖ కోలాట కళాకారిణి బొందలపాటి పద్మావతి, అభినయ నాట్య అకాడమీ నృత్య కళాకారిణి రూపాదేవి అభినందించారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా, మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్నికలు నియమ నిబంధనలకు అనుగుణంగా విధులు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ అన్నారు. మండలంలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 935 లీటర్ల నాటుసారాను, 380 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి సబ్ స్టేషన్ పరిధిలో నాటు సారా తయారీ, అక్రమ మద్యం రవాణా, అమ్మకాలకు కళ్లెం వేయాలన్నారు. అనంతరం అల్లిపల్లి, లింగరగూడెం, లంకలపులి ప్రాంతాల్లో మూడు చెక్‌పోస్టులను సందర్శించారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పాలచర్ల రాజవరం గ్రామానికి చెందిన పొగాకు రైతు బోధ రామ్‌మోహన్‌రెడ్డిపై దాడికి పాల్పడిన యువకుడు నాగేంద్రపై పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం రాత్రి పాలచార్ల రాజవరం గ్రామంలో పొగాకు బ్యారన్ దగ్గర రైతు రామ్‌మోహన్‌రెడ్డికి, అతని డ్రైవర్ వెంకన్నకు మధ్య కొద్దిపాటి గొడవ జరిగింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న వెంకన్న తమ్ముడి కుమారుడు నాగేంద్ర పక్కనే ఉన్న కూరగాయల చాకుతో రామ్‌మోహన్‌రెడ్డిపై దాడి చేశాడు. ఈ దాడిలో గాయాలపాలైన రామ్‌మోహన్‌రెడ్డిని స్థానికులు జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతని ఫిర్యాదు మేరకు యువకుడిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేయి కోసుకున్న యువకుడు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని తూర్పు దిగవల్లి గ్రామానికి చెందిన బందిలి బాబు అదే గ్రామంలో తన అత్తవారింట్లో ఉన్న భార్య, పిల్లలను చూసేందుకు వెళ్లగా వారు రానివ్వలేదు. దీంతో మనస్తాపానికి గురైన బాబు చాకుతో చేతిని కోసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు అతడిని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాబు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

బైక్ అదుపుతప్పి వ్యక్తి గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ద్వారకాతిరుమల ఆర్చి గేట్ సెంటర్ వద్ద పంచాయతీ వారు పంపు కనెక్షన్ ఇచ్చేందుకు గొయ్యి తీశారు. ఈ క్రమంలో గురువారం దొరసానిపాడు గ్రామానికి చెందిన చుండూరి చిన్నయ్య బైక్‌పై అటుగా వెళ్తుండగా ఆ మట్టిని తప్పించబోయి బైక్ అదుపుతప్పడంతో కిందపడిన చిన్నయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు చిన్నయ్యను అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ముసునూరు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని వద్ద ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కాట్రేనిపాడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - పోలవరం

నాటుసారా స్థావరంపై దాడి చేసిన పోలీసులు బెల్లపు ఊటను ధ్వంసం చేసి, నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఎల్ఎన్‌డి.పేట గ్రామ శివార్లలో నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ పవన్‌కుమార్ తన సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 50 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న తయారీదారుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్రమ మద్యం రవాణా, అమ్మకాలు, పంపిణీ, నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు.

పేకాటస్థావరంపై...

ముసునూరు : పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెక్కపల్లిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ వాసు తమ సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1110 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని డిఎస్‌పి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని మూడో పట్టణ పరిధిలో పోలీసు సాయుధ బలగాలతో గురువారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలకు అన్ని రకాలుగా భద్రత కల్పించేందుకే పోలీసు కవాతును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సువిధ యాప్ ద్వారా తమకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడో పట్టణ ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది, సాయుధ బలగాలు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసుల సంక్షేమానికి ఆ శాఖ కృషి చేస్తుందని అదనపు ఎస్‌పి స్వరూపరాణి అన్నారు. అనారోగ్య కారణాలతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.లక్ష అందించారు. జిల్లాలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వరరావు అనారోగ్య కారణాలతో కొన్నిరోజుల క్రితం మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు ఎఎస్‌పి పోలీసు కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసుల సంక్షేమానికి శాఖ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి అండగా నిలుస్తామని ఆమె తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా రోగులకు వైద్య సేవలందించాలని డిహెచ్ఎస్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బంది అందుబాటులో ఉంటూ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో సేవలందించాలన్నారు. ఈ మేరకు రక్త పరీక్షలు నిర్వహించే గదిని పరిశీలించి, రక్త పరీక్షలకు కావాల్సిన పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా స్థానికంగా పోస్టుమార్టం చేయడానికి కావాల్సిన గదిని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు మెడికల్ అధికారి డాక్టర్ పి.వసుంధర, డాక్టర్ ఎస్.జనార్దన్‌స్వామి, డాక్టర్ ఎన్.హేమంత్‌కుమార్, డాక్టర్ బి.సుధీర్, డాక్టర్ యెమిమా, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజా సమస్యల పరిష్కారంలో ఎవరు బాధ్యతగా పనిచేస్తారో ప్రజలే బేరీజు వేసుకోవాలని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆగిరిపల్లి మండలంలోని ఈదులగూడెం గ్రామంలో ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో గత మూడు దఫాల్లో పాలన ఏవిధంగా సాగిందో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, నెలకొన్న సమస్యలను చూస్తే అర్థమవుతుందన్నారు. తనకు అవకాశం ఇస్తే ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి చూపుతానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి'

ప్రజాశక్తి - భీమడోలు

వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని, వారికి చేకూరిన లబ్ధి గురించి వివరించాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. గుండుగొలనులోని వైసిపి కార్యాలయంలో గురువారం గుండుగొలను, కోరుకొల్లు, లక్ష్మీపురం గ్రామాల స్థాయి కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. గుండుగొలను గ్రామ ఉపసర్పంచి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ముదుండి సూర్యనారాయణరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ క్రమంలో వైసిపిలోకి చేరిన ఇతర పార్టీల నాయకులకు ఎంఎల్ఎ సాదారంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వాసుబాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు పార్టీ విజయానికి సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల పరిషత్ అధ్యక్షులు కనమాల రామయ్య, పార్టీ ప్రముఖులు రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేన రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సంయుక్త కార్యదర్శిగా కనకదుర్గ

ప్రజాశక్తి - కలిదిండి

జనసేన రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సంయుక్త కార్యదర్శిగా బట్టు లీలాకనకదుర్గ నియమితులయ్యారు. ఆమెకు మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఆమెకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నియామకపత్రం అందించారు. ప్రస్తుతం ఆమె మండలంలోని కోరుకొల్లు గ్రామ పంచాయతీ సర్పంచిగా కొనసాగుతున్నారు. పవన్‌కళ్యాణ్ రాజకీయ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని, పార్టీ బలోపేతానికి కృషి లీలా కనకదుర్గ తెలిపారు. ఆమె నియామకం పట్ల పలువురు నాయకులు, పార్టీ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆమెకు అభినందనలు తెలిపారు.

'పేదల అభ్యున్నతికి వైసిపి కృషి'

ముసునూరు : పేద, బడుగు, బలహీనులను ఆదుకునేది సిఎం జగనేనని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావు అన్నారు. మండలంలోని సూరేపల్లి, లోపూడి గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచార రథయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వెంకటప్రతాప్‌అప్పారావు మాట్లాడారు. ప్రజల అభ్యున్నతికి, రాష్ట్రాభివృద్ధికి సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కంబాల కృష్ణవేణి రాంబాబు, వైస్ ఛైర్మన్ బర్మా సీతారామయ్య, జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావు, సర్పంచులు పేరం కృష్ణ, నక్కనబోయిన సత్యనారాయణ, కొర్లకుంట సొసైటీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, వైసిపి గ్రామ అధ్యక్షులు బి.నరసింహరావు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మాక్సింగోర్కి జయంతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


మాక్సింగోర్కి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వక్తలు


ప్రపంచ ప్రఖ్యాత రచయితగా కోట్లాదిమందిని ప్రభావితం చేసిన అమ్మ నవల రచయిత మాక్సింగోర్కి 156వ జయంతి కార్యక్రమం ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పవర్‌పేట అన్నే భవనంలలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ ఎం.లక్ష్మి స్వాగతం పలికారు. ఈ సభకు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు అధ్యక్షత వహించారు. మాక్సింగోర్కి చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జి.శారద, బి.జగన్నాథరావు, ఎం.సిద్ధార్థసాయిజాన్‌బాబు, జి.కోటేశ్వరరావు, కంప్యూటర్ శిక్షణ కేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు. సభాధ్యక్షులు గుడిపాటి నరసింహరావు మాట్లాడుతూ గోర్కి నిరుపేదగా పుట్టినా రచన వ్యాసంగంతో ప్రపంచానికి ముఖ్యంగా రష్యా విప్లవానికి తోడ్పడిన ఎన్నో రచనలు చేశారన్నారు.ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ అధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ అమ్మ నవల, దానిలోని కథ వివరాలను తెలిపారు. బి.సోమయ్య మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణతో పాటు పరిసర ప్రాంతాల గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వైసిపి ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులు

జంగారెడ్డిగూడెం టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్, చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. పట్టణంలో వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నాలుగో వార్డు, ఇంద్రానగర్ కాలనీ, కొత్తపేట గ్రామంలో సచివాలయం కన్వీనర్ చిప్పాడ వెంకన్న ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి వైసిపిని గెలిపించాలని కోరారు. ఆరో వార్డు ప్రాంతంలో రామాలయం ఛైర్మన్ పాములపర్తి శ్రీను ఇంటి వద్ద నుంచి బందులతోటి సెంటర్ వరకు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి బివిఆర్.చౌదరి, వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పార్టీ పెద్దలు మండవల్లి సోంబాబు, మేడవరపు విద్యాసాగర్, ముప్పిడి శ్రీను, కౌన్సిలర్లు పిపిఎస్.చంద్రరావు, ఉగ్గం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


ప్రచారంలో వైసిపి ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులు


వెంకటరమణకు నగదు అందిస్తున్న నరసింహరావు

సహకార కేంద్ర బ్యాంకు సేవలు వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆగిరిపల్లి పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ పల్లగాని నరసింహరావు అన్నారు. ఆగిరిపల్లి పిఎసిఎస్ సంఘ సభ్యుడు గరికపూడి వీరాస్వామి ఇటీవల మృతి చెందాడు. కెడిసిసి బ్యాంక్ ఉత్తర్వుల ప్రకారం అతని భార్య గరికపూడి వెంకటరమణకు రూ.పది వేలు మట్టిఖర్చుల కింద గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సిఇఒ మట్టా రంగారావు, ఇళ్ల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'డిఎన్ఆర్‌ను ఆశీర్వదించండి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజల అభ్యున్నతి కోసం నిత్యం పరితపిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్‌ను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని దూలం నాగేశ్వరరావు చిన కోడలు దూలం స్వాతి కోరారు. మండలంలోని అల్లూరు పంచాయతీ పరిధిలో వైసిపి శ్రేణులతో కలిసి ఆమె గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ వైసిపి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్, కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావులకు ఓటు వేసి ఆఖండ విజయం చేకూర్చాలని కోరారు. ఈ ప్రచారంలో ఎంపిపి సత్యనారాయణ, గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, గ్రామ సర్పంచి శీలం రామకృష్ణ, తాడికి రాజేష్, కె.విష్ణు, పేరే రామకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రోషన్‌కుమార్

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి రోషన్‌కుమార్

ప్రజాశకి - చింతలపూడి

త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించి అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించేది టిడిపియేనని ఆ పార్టీ చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెంలో గురువారం ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో టిడిపి కూటమికి ఓట్లు వేసి, చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే మనం ప్రశాంతంగా జీవించగలమన్నారు. మనకు సుపరిపాలన లభిస్తుందన్నారు. ఆ దిశగా ప్రజలు ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి లింగపాలెం అధ్యక్షులు చలపతిరావు, ప్రసాద్, ఎస్‌సి నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను, జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

'కాపులకు సీట్లు కేటాయించకపోవడం దారుణం'

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి పోటీ చేసే ఆరు పార్లమెంట్, పది అసెంబ్లీ స్థానాల్లో కాపులకు ప్రాతినిధ్యం లేకపోవటం పట్ల కాపు సంక్షేమ సేవా సంఘ తెలుగు రాష్ట్రాల వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీరాములు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనాభా దామాషా ప్రకారం బిజెపి రెండు ఎంపీ, మూడు ఎంఎల్ఎ స్థానాలు కాపులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో బిజెపి కాపులకు అన్యాయం చేసిందన్నారు.

'పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేయాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి పని చేయాలని టిడిపి యువనేత కొడాలి వినోద్ అన్నారు. స్థానిక గురజ రోడ్డులోని ఆయన నివాసంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కైకలూరు ఎంఎల్ఎ సీటు బిజెపికి కేటాయించడంపై టిడిపి శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి తనతో పాటు అందరూ పార్టీ విజయానికి పని చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యకర్తలకు అండగా ఉండి న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో లోకేష్‌ను కలిసి సమావేశం ఏర్పాటు చేస్తానని కార్యకర్తలకు తెలిపారు.

ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మిట్టగూడెం గ్రామంలో ఆంజనేయ సహిత సీతారామ ఆలయ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరయ్యారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఎంఎల్ఎ చేతులమీదుగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రత్నకుమార్ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చేనేత కార్మిక సంఘం ఉభయ గోదావరి జిల్లా అధ్యక్షులు కాసా రత్నకుమార్(68) మృతి జిల్లాలోని చేనేత కార్మిక ఉద్యమానికి తీరని లోటని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో పాలకొల్లు మండలంలోని దిగమర్రు గ్రామంలో మృతి చెందిన రత్నకుమార్ జిల్లా చేనేత కార్మికులతో సత్సంబంధాలు కలిగి ఉన్నారని ఆదిశేషు తెలిపారు. నేతన్న నేస్తం పథకం కోసం జిల్లా వ్యాప్తంగా జరిగిన ఆందోళన పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు.